## క్లుప్తంగా

### హరీశ్‌రావు చిత్రపటానికి రైతుల క్షీరాభిషేకం



హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

సిద్దిపేటరూరల్: తమ గ్రామ రైతులకు సాగునీరు అందించడంలో ప్రత్యేక కృషిచేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి రైతులు ఆయన చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో యాసంగి వరి పంటలు ఎండకుండా ముందస్తుగా సాగునీరు అందుబాటులోకి వచ్చేవన్నారు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో సరైన సమయంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. సాగునీరు అందడంలో హరీశ్‌రావు చొరవ ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు శంకర్, రైతులు పాల్గొన్నారు.

### విద్యుత్ లైట్లు లేక ప్రమాదాలు: రాజిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నర్సాపూర్ బైపాస్ చౌరస్తాలో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రెటరీ ఎర్రబోలు రాజిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్ బైపాస్ రాజీవ్ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయని, రాత్రి సమయంలో లైట్‌లు లేక చౌరస్తా వద్ద అనేక ప్రమాదాలు సంభవించి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. సిద్దిపేట డబుల్‌బెడ్రూం కాలనీకి వెళ్లే ప్రజలు ఈ చౌరస్తాను దాటాల్సి ఉంటుందని, విద్యార్థులు, కూలీలు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైట్లు, సూచిక బోర్డులు ఏర్పాటుచేసి ప్రమాదాలను నిలువరించాలని కోరారు.

### బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కార్మికులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇటీవల మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలను కార్మిక సంఘం సభ్యులు ఆదివారం పరామర్శించారు. చౌడారంలో కడారి లింగం, మాచాపూర్‌లో కొయ్యడ చంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఆ కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గాల ఎంపిక



అంబేడ్కర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో ముస్లిం మైనార్టీ సంఘం గ్రామ కార్యవర్గం, అంబేడ్కర్ సంక్షేమ గ్రామ సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవం అయ్యాయి. అధ్యక్షుడిగా ఎండీ అక్బర్ పాషా, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ నబి, ప్రధాన కార్యదర్శిగా నూరొద్దిన్, కోశాధికారిగా నవీద్, సలహాదారులుగా సల్మాన్, గూడ్ సాహెబ్ తదితరులు ఎంపికయ్యారు. అలాగే అంబేడ్కర్ సంఘం గ్రామ అధ్యక్షుడిగా కొమ్ము లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా పిల్లి అశోక్, కొమ్ము నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా పల్లె రాజశేఖర్, కోశాధికారిగా బాకి రాజశేఖర్, సహాయ కార్యదర్శులుగా బాకి కరుణాకర్, పల్లె సురేశ్, క్రీడల కార్యదర్శిగా సంపత్, ప్రచార కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణతో పాటు మరి కొందరు ఎంపికయ్యారు.

### రాష్ట్ర కమిటీ నియామకం

ములుగు(గజ్వేల్): మండలంలోని బండమైలారంలో రాష్ట్ర గ్రంథాలయాల పార్ట్‌టైం స్వీపర్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్ట్‌టైం స్వీపర్‌ల (పీటీఎస్) రాష్ట్ర కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా పిట్లా హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా కస్తాల మధు, ఉపాధ్యక్షుడిగా సీహెచ్.ఎల్లం, అంకుష్ కుమార్, కోశాధికారిగా ఖమ్మంపాటి మధుసూదన్, సహాయ కార్యదర్శులుగా సలీం, చెరుకుపల్లి స్వామి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆయా జిల్లాలకు చెందిన పార్ట్‌టైం స్వీపర్‌లు పాల్గొన్నారు.

# గ్రామాల గజిబిజి

## జిల్లాలు, మండలాలు ఏర్పాటుతో అస్తవ్యస్తం

- ఆరు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు
- అధికారులు, నేతలకు విన్నవించినా ఫలితం శూన్యం
- సమస్య తీర్చాలంటున్న గ్రామస్తులు



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామస్తులు(ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్రం ఏర్పాటు తర్వాత 2016లో జరిగిన జిల్లాల విభజన ప్రక్రియలో భాగంగా కొన్ని మండలాల పరిధిలోని గ్రామాల పరిస్థితి గజిబిజిగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ నియోజకవర్గంలోని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి(కొత్తది) మండలాల పరిధిలోని గ్రామాలు సిద్దిపేట జిల్లాలో విలీనం చేశారు. అలాగే చేర్యాల మండల పరిధిలోని కొన్ని గ్రామాలను కలుపుకొని కొమురవెల్లి మండలం ఏర్పాటు చేశారు. తర్వాత కొద్ది రోజులకు మద్దూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలను కలుపుతూ దూల్మిట్ట మండలం ఏర్పాటు చేశారు.

**దూరాభారం**

ఈ మండలాల పరిధిలోని ఆరు గ్రామాలు శభాష్‌గూడెం, నాగపురి, పెద్దరాజుపేట, వేచరేణి, అర్జునపట్ల, కమలాయపల్లి గ్రామాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ ఆరు గ్రామాల రెవెన్యూ మండలం ఒక్కటే అయినప్పటికీ మండల స్థాయి కార్యాలయాలకు మాత్రం వేరే మండలాలైన కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రజలకు తప్పని తిప్పలు**

చేర్యాల రెవెన్యూ మండల పరిధిలోని నాగపురి, శభాష్‌గూడెం, పెద్దరాజుపేట, వేచరేణి గ్రామాలు నూతనంగా ఏర్పాటైన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వెళ్లాయి. దీంతో ఈ నాలుగు గ్రామాల ప్రజలు పోలీస్‌స్టేషన్ పనుల నిమిత్తం కొమురవెల్లికి వెళ్లాల్సి వస్తోంది. జిల్లాల ఏర్పాటు అనంతరం కొద్ది రోజుల తర్వాత మద్దూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలను కలుపుతూ దూల్మిట్టను మండలం చేసింది గత ప్రభుత్వం. దీంతో మద్దూరు పరిధిలోని మండల కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాల ప్రజల విన్నపం మేరకు చేర్యాల మండలంలో కలుపుతూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. రెండు గ్రామాలు రెవెన్యూపరంగా మాత్రమే చేర్యాలలో కలిశాయి. కానీ మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ కోసం మద్దూరు మండలానికి, వ్యవసాయశాఖ అధికారి కోసం దూల్మిట్ట మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఇక పోతే నూతనంగా ఏర్పడ్డ దూల్మిట్ట మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాలు లేకపోవడంతో దూల్మిట్ట మండల పరిధిలోని గ్రామాల ప్రజలు ఇప్పటికీ మండలస్థాయి కార్యాలయాల్లో పనుల కోసం మద్దూరుకే వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం నూతన గ్రామ పంచాయతీలు, మండలాలు, జిల్లాలు ఏర్పాటు చేసింది. కానీ ఈ నాలుగు మండలాల పరిధిలోని ఆరు గ్రామాల పరిస్థితి మాత్రం ఆ ప్రక్రియతో గజిబిజిగా తయారైంది. దీనిపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం స్పందించి పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.




కమలాయపల్లి గ్రామ సూచిక బోర్డు

**చేర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చాలి**



నాగపురితో పాటు పెద్దరాజుపేట, శభాష్ గూడెం, వేచరేణి గ్రామాలు గతంలో చేర్యాల మండల పరిధిలో ఉండేవి. జిల్లాల ఏర్పాటు సమయంలో రెవెన్యూ మండలం చేర్యాల పరిధిలోనే ఉన్నప్పటికీ పోలీస్‌స్టేషన్ మాత్రం కొమురవెల్లికి మారింది. దీంతో ఏదైనా సమస్య ఉంటే చేర్యాల, కొమురవెల్లి రెండు చోట్లకు వెళ్లడం ఇబ్బందిగా మారింది. దీనిపై గతంలో జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు కూడా ఇచ్చాం. కానీ ఫలితం లేదు. ప్రభుత్వం, అధికారులు, స్పందించి మా గ్రామాలను చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలి.

– బండమీది కరుణాకర్, నాగపురి

**చేర్యాలలోనే పూర్తిస్థాయిలో కలపాలి**



గత ప్రభుత్వ హయాంలో రెండు గ్రామాల ప్రజల కోరిక మేరకు చేర్యాల మండలంలో కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. మండలం పేరు మాత్రమే చేర్యాలగా మారింది. కాని మండల స్థాయి అధికారులు(తహసీల్దార్ తప్ప) మిగతా కార్యాలయాల్లో పనుల కోసం ఇంకా మద్దూరు, దూల్మిట్టకే వెళ్లాల్సి వస్తోంది. దీనిపై మంత్రి సీతక్క, జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం, కానీ ఫలితం మాత్రం లేదు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వజ్రోజు శంకరాచారి, కమలాయపల్లి

# అత్యద్భుతం.. మహా సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

- ఒకే వేదికపైకి 2వేల మంది పూర్వ విద్యార్థులు
- గురువులకు పూర్ణ కుంభంతో స్వాగతం..
- దేశ విదేశాల నుంచి తరలివచ్చిన మిత్రులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల జీఎంఆర్(ప్రభుత్వ ఆదర్శ గురుకుల) పాలిటెక్నిక్ కళాశాలలో 1988 నుంచి 2021 వరకు 33 యేళ్ల కాలంలో వివిధ బ్రాంచ్‌లలో సుమారు 2,600 మంది విద్యార్థులు విద్యను అభ్యసించారు. వారందరినీ ఒకే వేదికపైకి చేర్చాలనే సంకల్పంతో పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనానికి శ్రీకారం చుట్టారు. 1989 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి మ్యాజిక్ భాస్కర్ తన తోటి మిత్రులైన మరో 20 మందితో కలిసి వాట్సాప్ గ్రూపుల ద్వారా పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు మూడు నెలల పాటు శ్రమించారు. ఎట్టకేలకు ఆదివారం మహా సమ్మేళనం నిర్వహించారు.

**సమ్మేళనంలో పాల్గొన్న 2 వేల మంది..**

సమ్మేళనానికి దేశ విదేశాలలో స్థిరపడిన సుమారు 2 వేల మంది తరలి వచ్చారు. గురువులను పూర్ణ కుంభం, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతోపాటు హాస్టల్‌లో వంట చేసిపెట్టిన సిబ్బందిని సైతం సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక నృత్యప్రదర్శన చూపరులను ఆకట్టుకోగా, కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు రూపొందించిన గీతాలాపన అబ్బురపరిచింది.

**దేశ, విదేశాల నుంచి..**

ఆస్ట్రేలియా, మలేషియా, దుబాయ్, అమెరికాతో పాటు మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార కార్యకలాపాల్లో ఉన్న సుమారు 2వేల మంది పూర్వ విద్యార్థులు కళాశాలలో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన సుమారు 200 మంది వరకు(ప్రిన్సిపాళ్లు, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు, హెచ్ఓడీలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది) పాల్గొన్నారు.

**హోదాలను మరచిపోయారు**



ఆత్మీయ మహాసమ్మేళనానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులంతా తమ హోదాలను మరచిపోయి ఆనందంగా గడిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వారితో పాటు వ్యాపారాలు చేస్తున్న వారంతా ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– మ్యాజిక్ భాస్కర్, కార్యక్రమ నిర్వాహకుడు

**మరచిపోలేని అనుభూతి**



చదువుకున్న రోజులు మరోసారి గుర్తు చేసుకున్నాం. విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పాటు తోటి విద్యార్థులంతా ఒకే చోట కలుసుకోవడం మరచిపోలేని అనుభూతిని మిగిల్చింది. వివిధ హోదాల్లో ఉన్నవారంతా సమ్మేళనానికి తరలిరావడం, ప్రతి ఒక్కరిని సన్మానించుకోవడం అభినందనీయం.

– శ్రీనివాస్, సింగరేణి ఉద్యోగి, గోదావరిఖని

**చాలా సంతోషంగా ఉంది**



ఈ సమ్మేళనంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చింది. మూడేళ్ల పాటు కలిసి చదువుకున్న వారంతా ఒకే వేదికపైకి రావడం మరచిపోలేని అనుభూతిని మిగిల్చింది. ఇలాంటి కార్యక్రమంలో భాగస్వామినైనందుకు ఆనందంగా ఉంది.

– హేమంత్‌కుమార్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

**విద్యతోనే ఉన్నత శిఖరాలకు..**



మాకు విద్య నేర్పిన గురువులను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నాం. ఏ రంగంలో ఉన్నా ఎక్కడి నుంచి వచ్చామనేది మరచిపోవద్దు. గురువులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ తాము ఎంచుకున్న రంగాల్లో రాణించాలి. పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహా సమ్మేళనంలో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది.

– జార్జ్ విల్సన్, వ్యాపారి, ఒడిశా

# సాగునీటి కోసం ఎంపీకి విన్నపం



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన బీజేపీ నాయకులు

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులకు సాగు నీటిని విడుదల చేయాలని పలువురు బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. మండల అధ్యక్షుడు నీల సత్యం ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఎంపీని కలిశారు. గతంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ4 కాలువ ద్వారా తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, జప్తినాచారం, మర్పడ్గ, ఖమ్మంపల్లి గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా కాపాడిన విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు మర్పడ్గ, రాంపల్లి, దుద్దెడ, బందారం అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లోని చెరువులకు నీరు వెళ్లేందుకు మర్పడ్గ, రాంపల్లి గ్రామాల శివారుల్లో కాలువ తవ్వకం పనులు ఆగిపోయిన విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజార్వయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులు నిండేలా ఇరిగేషన్‌శాఖ అధికారులతో మాట్లాడి పని జరిగేలా చూస్తామన్నారు.

# శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులు వద్దు

- గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించండి
- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నేత సదన్ మహరాజ్




మాట్లాడుతున్న సదన్ మహరాజ్

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులే కాదు.. ప్రజలందరికీ మంచి వైద్యసేవలను అందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ గ్రామానికి వెళ్లినా శ్మశానవాటికలే దర్శనమిస్తున్నాయని, ఆస్పత్రులు, పాఠశాలలను కూడా బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. విద్య, వైద్యం, ఇళ్ల లాంటివి పేదప్రజల దరికి చేరడంలేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, పరశురాములు, నరేశ్, రాకేశ్, అనిల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ పూర్వవిద్యార్థుల వైద్య సేవలు



ప్రిన్సిపాల్‌తో వైద్యులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు

వర్గల్(గజ్వేల్): వైద్యులుగా స్థిరపడిన పలువురు జవహర్ నవోదయ విద్యాలయ పూర్వ విద్యార్థులు ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. పూర్వవిద్యార్థులైన వైద్యులు సాయినాథ్‌రెడ్డి(ఆర్థోపెడిక్), ఎం.సునీల్‌కుమార్, ఎ.సంపత్‌కుమార్, జి.శ్రీలత, బి.శివకుమార్, జి.సాయి మహేశ్, అన్నా పరికిణి, వెంకట్ చాణుక్య తదితరులు విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపారు. నవోదయ విద్యార్థుల కోసం ఒక రోజు కేటాయించిన వారందరినీ ప్రిన్సిపాల్ రాజేందర్ అభినందించారు.

# వైభవంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న నాయకులు

హుస్నాబాద్: పట్టణంలోని సిద్ధేశ్వరగుట్టపై ఉన్న అయ్యప్ప ఆలయ 23వ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా గణపతి పూజ, పుణ్యా వచనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్, మున్సిపల్ మాజీ చైర్మన్లు రజిత, సుద్దాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### సమష్టి పోరాటంతోనే సమస్యల పరిష్కారం

బెజ్జంకి(సిద్దిపేట): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పోరాడాలని వికలాంగుల సమస్యల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిట్యాల సంపత్ పిలునిచ్చారు. బెజ్జంకిలో చైతన్య వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆ ప్రచారం నమ్మొద్దు

గజ్వేల్: సహారా ఇండియా డిపాజిట్‌దారులకు మెచ్యూరిటీ డబ్బుల చెల్లింపుల్లో ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమేనని, ఆలస్యమైనా డబ్బుల చెల్లింపులు జరుగుతాయని ఆ సంస్థకు చెందిన సీనియర్ ఏజెంట్లు వెంకటచారి, అశోక్, మల్లేశం, లక్ష్మణ్, జితేందర్, మల్లికార్జున్, ప్రసాద్, సతీశ్ తదితరులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది దురుద్దేశంతో డిపాజిట్‌దారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు.

### వైభవంగా వెంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం



అగ్నిప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని శ్రీ భూ నీలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ 55వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గోపూజ, యాగశాల ప్రవేశం, మూలమంత్ర హవనం, అగ్నిప్రతిష్ఠ, నిత్యపూర్ణాహుతి, 108 కళశాలలో నింపిన సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారి కల్యాణానికి ఎదురుకోలు నిర్వహించారు. సోమవారం శ్రీ భూనీళా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణం జరగనుందని నిర్వాహకులు తెలిపారు.

### సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ, రాంపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు పనుల నిర్మాణాలకు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, సురేందర్‌రావు, మల్లికార్జున్, వెంకటేశం సుదర్శన్, పరశురాములు, రాజు, శ్రీకాంత్, సిద్దులు, సురేశ్, తిరుపతిరెడ్డి, శంభయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దుబ్బాకటౌన్: మున్సిపల్ పరిధిలోని లచ్చపేట జిల్లా ఉన్నత పాఠశాల (1999–2000) బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ నాటి ఘటనలను గుర్తుచేసుకొన్నారు. అనంతరం విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు.

# కేసీఆర్‌ను ప్రశ్నించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

**మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్**



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గజ్వేల్: గజ్వేల్ అభివృద్ధి విషయంలో కేసీఆర్‌ను ప్రశ్నించే అర్హత స్థానిక కాంగ్రెస్ నాయకులకు లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కృషి వల్ల నియోజకవర్గ దశదిశా మారిపోయిందని గుర్తు చేశారు. రైల్వే లైన్, రింగు రోడ్డు, ఎడ్యుకేషన్ హబ్, వంద పడకల ఆసుపత్రి, ములుగులో హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ కళాశాలతోపాటు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. ఇవే కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేశారని కొనియాడారు. ప్రస్తుతం గజ్వేల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం చేతకాక కేసీఆర్‌పై విమర్శలు గుప్పించడం సిగ్గుచేటన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎన్నో సమస్యలను పరిష్కరించినా ఇంకా కొన్ని సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నవాజ్‌మీరా, చందు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్2 ఫలితాలు విడుదల చేయొద్దు

**ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పరశురాం**



కొండపాక(గజ్వేల్): ఎమ్మార్పీఎస్ డప్పుల ప్రదర్శన

కొండపాక(గజ్వేల్): ఎస్సీ వర్గీకరణ అమలు చేసేంత వరకు గ్రూప్ 2 ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కిషన్ ఆధ్వర్యంలో కుకునూరుపల్లిలో ఆదివారం డప్పుల ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో ఉన్న లోపాలను సవరించాలన్నారు. వర్గీకరణ మూడు గ్రూపులుగా కాకుండా ఏబీసీడీలుగా విభజించాలని, మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ పక్రియ పూర్తి అయ్యేంత వరకు గ్రూప్ 2 ఫలితాలను నిలిపివేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కిషన్, కనకయ్య, నాగరాజు, మల్లేశం, యాదగిరి, మధు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ములుగులో..**

ములుగు(గజ్వేల్): ములుగు రాజీవ్‌రహదారి నుంచి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో నాయకులు డప్పులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, మహేశ్, మల్లేశ్, వినోద్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.